

ఆధ్యాత్మిక శోభ
ముస్లింల పవిత్ర మాసం రంజాన్ నెల ప్రారంభం కావడంతో మసీదుల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. - 8లో..



భక్తిశ్రద్ధలతో ఉగాది ఉత్సవాలు
మార్కాపురం పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ దేవస్థానంలో ఉగాది ఉత్సవాలు ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
32/24

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

సోమవారం	ఇఫ్తార్	
సాయంత్రం	గం 6 : 27	
మంగళవారం	సహరి	
ఉదయం	గం 5 : 03	

న్యూస్‌రీల్

పంచాయతీ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షునిగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావును సన్మానిస్తున్న సంఘ సభ్యులు

సింగరాయకొండ: ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా సింగరాయకొండ గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న జమండ్లమూడి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చీరాలలోని ఎన్‌జీఓ భవనంలో ఆదివారం ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘ సమావేశం నిర్వహించారు. సహాధ్యక్షునిగా ఎన్ కృపాచార్యులు, జనరల్ సెక్రటరీగా జీ సాయిమహేష్, ఉపాధ్యక్షునిగా యం వెంకటేశ్వర్లు, కోశాధికారిగా సూర్యనారాయణ ఎంపికయ్యారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం వెంకటరెడ్డి, మాజీ సలహాదారు షేక్ యూసఫ్ మెహరాలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఓఎంఎస్ 65 ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కొనుగోలు కేంద్రాల్లో కందులు అమ్ముకోవాలి

- మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హరికృష్ణ

మద్దిపూడి: రైతులు పండించిన కంది పంటను కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే అమ్ముకోవాలని మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని చిమట, మద్దిపూడి సొసైటీల వద్ద కందుల కొనుగోలు కేంద్రాలను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో కందులను ప్రభుత్వం రూ.7,5510లకు కొనుగోలు చేస్తుందన్నారు. 2024లో ఖరీఫ్‌లో కంది పంట నమోదు చేయించుకున్న రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కందులు కొనుగోలు చేయాలంటే 12 శాతం తేమ ఉండాలన్నారు. కొనుగోలు చేసిన కందుల డబ్బులు రైతుల అకౌంట్‌లో వేస్తారన్నారు. ఆయన వెంట ఏఓ వెంకటేష్, రైతులు ఉన్నారు.

మెరిట్ కం రోస్టర్ పద్ధతి పాటించండి

- హిందీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహబూబ్ ఖాన్


ఒంగోలు సిటీ: ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా 2019 ప్రమోషన్ లిస్టుకు అనుగుణంగా ఉండాలని హిందీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పఠాన్ మహబూబ్ ఖాన్ అన్నారు. హిందీ ఉపాధ్యాయ సంఘం ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో 2025 హిందీ సీనియార్టీ లిస్టులో సవరణల కోసం డీఈఓ కార్యాలయంలో ఏడీకి భాషోపాధ్యాయులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని ఆదివారం మెమొరాండం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పఠాన్ మహబూబ్ ఖాన్ మాట్లాడుతూ 2019లో ప్రమోషన్ పొందిన తెలుగు, హిందీ, వ్యాయామ ఉపాధ్యాయుల సీనియార్టీని నవంబర్ 1, 2019 నుంచి తీసుకోవాలన్నారు. అంతర్‌జిల్లా బదిలీల్లో వచ్చిన వారి సీనియార్టీని మన జిల్లాలో జాయిన్ అయిన తేదీనే పరిగణించాలని కోరారు. 2019 నవంబర్ కంటే ముందు పదోన్నతి పొందిన వారి జాబితా కూడా మెరిట్ కం రోస్టర్ పద్ధతిలోనే ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పోలు శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి జి.భాస్కర రావు, కందుకూరు డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ మస్తాన్ వలి, మహిళా సభ్యులు షేక్ ఉజ్మా భాను, టీ అనురాధ తదితరులు పాల్గొన్నారు.



ఏడీకి మెమొరాండం అందజేస్తున్న హిందీ ఉపాధ్యాయ సంఘ నాయకులు

పునరావాసం.. పరిహాసం

వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణంపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం మరోమారు బట్టబయలైంది. 9 నెలలుగా ప్రాజెక్టు పని ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు. ఇక పునరావాసం ఊసే లేదు. బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించడం, మార్కాపురం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు ప్రాజెక్టు పునరావాస పనులపై నిర్దిష్టమైన హామీ ఇవ్వకపోవడంతో ఇప్పట్లో ప్రాజెక్టు పూర్తయ్యే అవకాశం లేనట్లేనని నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ముంపునకు గురవుతున్న గొట్టిపడియ గ్రామం వ్యూ

- వెలుగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల్లో పునరావాస చర్యలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- ముంపు గ్రామాల ప్రజల త్యాగాలకు విలువేదీ?
- ప్రాజెక్టు నిర్వాసితులకు బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్వాసితుల కాలనీల్లో అభివృద్ధి పనులు
- 9 నెలలుగా నిలిచిన పనులు
- మార్కాపురం పర్యటనలో వెలుగొండపై స్పష్టత ఇవ్వని సీఎం

మార్కాపురం: ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో సుమారు నాలుగున్నర లక్షల ఎకరాలకు సాగునీరు, 16 లక్షల మంది ప్రజలకు తాగునీటిని అందించే వెలుగొండ ప్రాజెక్టుపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. ఎన్నికలకు ముందు మార్కాపురం వచ్చిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే వెలుగొండ ప్రాజెక్టుకు అత్యధిక నిధులు కేటాయించి త్వరగా పూర్తిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలందరూ నమ్మారు. ఈనెలలో శాసన సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం రూ.309.13 కోట్లు మాత్రమే కేటాయించడంపై సర్వత్రా నిరసన, ఆగ్రహం వ్యక్తమవుతోంది. మరోసారి తమను కూటమి ప్రభుత్వం మోసం చేసిందనే భావన ముంపు గ్రామాల ప్రజల్లో ఏర్పడింది. దీనికి తోడు మహిళా దినోత్సవం రోజున మార్కాపురం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెలుగొండ ప్రాజెక్టుపై మహిళలు అడిగిన ప్రశ్నకు స్పష్టత లేని సమాధానం ఇవ్వలేదు. ఎన్నికల సమయంలో చెప్పిన మాటనే ఇప్పుడు కూడా చెప్పడం... ఎప్పుడు పూర్తి చేస్తారో స్పష్టమైన హామీ లేకపోవడంతో ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు కింద మార్కాపురం, యర్రగొండ పాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో మొత్తం 11 గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. తాతల నాటి ఊర్లను వదిలి, ఇళ్లను, పొలాలను త్యాగంచేసి బయటకు వచ్చేందుకు అక్కడి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. అయితే ప్రభుత్వం వీరిపట్ల చూపుతున్న నిర్లక్ష్యంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరందరూ తమకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, పునరావాస కాలనీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అయితే సీఎం పర్యటనలో వీటిపై స్పష్టమైన హామీ రాకపోగా, వెలుగొండను తానే పూర్తి చేస్తానంటూ మరోమారు చంద్రబాబు చేసిన ప్రకటన ఎవరికీ సంతృప్తి ఇవ్వలేదు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వెలుగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజల పునరావాస కాలనీలపై ప్రత్యేక దృష్టిపెట్టడంతో పనులు వేగంగా జరిగాయి. అయితే గతేడాది మార్చిలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు నిలిచాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వాటిని పట్టించుకోకపోవడంతో తొమ్మిది నెలల నుంచి పునరావాస కాలనీల్లో పిచ్చిచెట్లు, చిల్లచెట్లు మొలిచి పెద్దవై అరణ్యాన్ని తలపిస్తున్నాయి. విషసర్పాలు, అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా నిలిచాయి.

ప్రాజెక్టు పరిధిలో 11 ముంపు గ్రామాలు

పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గొట్టిపడియ, సుంకేశుల, కాకర్ల డ్యామ్‌లను నాటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పూర్తిచేశాడు. మూడు గ్యాప్‌ల పరిధిలో మొత్తం 11 గ్రామాలను ఖాళీ చేయిస్తున్నారు. ఇందులో 7270 కుటుంబాలు ఉన్నాయి.

ముంపు గ్రామం	నిర్వాసితుల సంఖ్య
కలనూతల	1118
చింతలముడిపి	88
సుంకేశుల	2901
గుండంచర్ల	1201
కాటంరాజు తండా	38
అక్కచెరువు	158
గొట్టిపడియ	1420
సాయిరాంనగర్	26
రామలింగేశ్వరపురం	36
కృష్ణానగర్	78
పొట్టిబసవాయిపల్లి (లక్ష్మీపురం)	206



గొట్టిపడియ నిర్వాసితుల కాలనీలో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన సిమెంటు రోడ్డు

2019-24 మధ్య జరిగిన పునరావాస చర్యలు ఇవీ..

మార్కాపురం మండలం గొట్టిపడియ, అక్కచెరువు తాండ నిర్వాసితులకు మార్కాపురం మండలం కుంట వద్ద, పెద్దారవీడు మండలం సుంకేశుల, కలనూతల, చింతలముడిపి గ్రామాల వారికి గోగుల దిన్నె వద్ద, సుంకేశులలోని ఎస్సీలకు తోకపల్లి వద్ద కలనూతలలో కొంతమంది నిర్వాసితులకు ఇడుపూరు వద్ద కాలనీలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సిమెంటు రోడ్లు, వాటర్‌ట్యాంకులు, కమ్యూనిటీ హాలు, పాఠశాలలను నిర్మించారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వీటిని పట్టించుకోకపోవడంతో చిల్లచెట్లు, పిచ్చికంపతో నిండిపోయి అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారాయి. దీంతో నిర్వాసితుల్లో ఒక రకమైన నిరాశ, నిస్పృహలు ఏర్పడ్డాయి. ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపులు చూసి ఇప్పట్లో వెలుగొండ పూర్తికాదనే విషయం అర్థమవుతోంది.



నిర్వాసితుల కాలనీలో నిర్మించిన స్కూల్ భవనం



ముళ్లచెట్లతో నిండిన పునరావాస కాలనీ



ఆర్‌ఆర్ ప్యాకేజీ వెంటనే ఇవ్వాలి

సీఎం మార్కాపురం వచ్చిన సందర్భంగా వెలుగొండపై స్పష్టత వస్తుందని ఆశపడ్డాం. సీఎం ప్రాజెక్టు పూర్తిచేస్తామన్నారే కానీ గడువు చెప్పలేదు. రాష్ట్ర ప్రభుత్వం వెలుగొండ నిర్వాసితులకు వెంటనే ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి. నాటి ఒప్పందం ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రూ.14 లక్షలతో పాటు పునరావాస కాలనీల్లో పక్కా గృహం కట్టించి ఇవ్వాలి. అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి. పునరావాస కాలనీల్లో అన్నీ సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.

– తుమ్మా వెంకటరెడ్డి, గొట్టిపడియ



ప్రభుత్వ స్పందనపై ఆందోళన

నిర్వాసితుల పట్ల ప్రభుత్వం చూపిస్తున్న స్పందనపై మా గ్రామస్తుల్లో ఆందోళన నెలకొంది. నిర్వాసితుల కాలనీలు ఎప్పుడు పూర్తిచేస్తారో అర్థం కావడం లేదు. మరోవైపు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయి. గత ఏడాది అక్టోబర్‌లో మంత్రులు వెలుగొండకు వచ్చి పరిశీలించారు. త్వరగా పూర్తి చేస్తామన్నారు. బడ్జెట్‌లో మాత్రం అతితక్కువ నిధులు కేటాయించారు. ఇలా చేస్తే ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో వారికే తెలియాలి. ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలి. వెంటనే రూ.2 వేల కోట్లు కేటాయించి పనులు పూర్తిచేయడంతో పాటు ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలి. ఈ సీజన్‌లోనే వరద నీటితో ప్రాజెక్టు నింపాలి.

– నల్లబోతుల కొండయ్య, గొట్టిపడియ

నిలకడ లేని నిమ్మ ధర



వ్యాపారుల వద్ద గ్రేడ్ చేసిన నిమ్మ కాయలు



తెగుళ్లతో నాణ్యత లేకపోవడంతో రోడ్డు పక్కన పడేసిన నిమ్మకాయలు

- దళారుల దెబ్బతో పెరగని ధర
- నష్టాలు తప్పడం లేదంటున్న నిమ్మ కౌలు రైతులు

హనుమంతునిపాడు: దళారుల దెబ్బతో నిమ్మ రైతుకు మద్దతు ధర దక్కడం లేదు. ధరలు నిలకడ లేకుండా రోజుకో రకంగా ఉన్నాయని రైతులు వాపోతున్నారు. నిమ్మసాగులో హనుమంతునిపాడు మండలం జిల్లాలో మొదటి స్థానంలో ఉంది. కనిగిరి నుంచి చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, ముంబాయి ప్రాంతాలకు ఇక్కడ నుంచి ఎగుమతి చేస్తారు. చిన్న చిన్న వ్యాపారులు తోటల వద్దకు వెళ్లి రైతుల వద్ద పండు కాయ కొనుగోలు చేసి గుంటూరు, విజయవాడ, చెన్నై, విశాఖపట్నం ప్రాంతాలకు బస్సుల ద్వారా తరలిస్తున్నారు. మండలం నుంచి రోజూ కనిగిరి మార్కెట్‌కు 3 నుంచి 4 లారీల్లో, ఆటోలు, మినీ ట్రక్కుల్లోనూ నిమ్మకాయలు తరలిస్తుంటారు. శనివారం పండు నిమ్మకాయ కిలో రూ.30 నుంచి రూ.35 కాయ నాణ్యతను బట్టి కొనుగోలు చేశారు. పచ్చికాయ కిలో రూ.40 నుంచి రూ.45 వరకు ధర పలికిందని రైతులు చెబుతున్నారు. ఒకరోజు వేసిన ధర రెండో రోజు ఉండటం లేదు. మంగు, గజ్జి, మచ్చలున్న కాయను గ్రేడ్ చేసి పనికి రావని రోడ్ల పక్కన పోశారు. ఇటీవల ఒకరోజు కిలో రూ.100 నుంచి రూ.120 వరకు ధర పెట్టి కొనుగోలు చేశారు. ధర ఉందని రైతులు చెట్టుకున్న కాయలను కోసి భారీగా కనిగిరి వ్యాపారుల వద్దకు తరలించారు. మరుసటి రోజే కిలో రూ.120ల నుంచి రూ.70లకు ధర పడిపోయింది. ధర లేదని చెప్పి నిమ్మకాయ వ్యాపారులు కొనుగోలు చేయలేదు. దీంతో రైతులు తెచ్చిన కాయను వ్యాపారులు అడిగిన ధరకు ఇచ్చి వెళ్లారు. వ్యాపారులు కుమ్మక్కై ఒకే ధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిమ్మ రైతుకు మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని కోరుతున్నారు.



ఎంపికైన బాలికల కబడ్డీ జట్టు

సబ్ జూనియర్ కబడ్డీ బాలబాలికల జట్ల ఎంపిక

ఒంగోలు: సబ్ జూనియర్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక స్థానిక మినీ స్టేడియం ఆవరణలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ చంద్రమోహన్ రెడ్డి, అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు తదితరలు పాల్గొని ఎంపిక ప్రక్రియను పరిశీలించారు. ఎంపికైన రెండు జట్లు ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు.

బాలుర జట్టు:
ఎ.అశోక్‌రెడ్డి, ఎస్.ఏడుకొండలరెడ్డి, జి.శ్రీనివాస రెడ్డి, డీవీ మాధవరెడ్డి, సాయి జస్వంత్, ఎం.సోమేష్, డి.చంద్రశేఖరరెడ్డి, జి.జైపాల్‌రెడ్డి, ఎం.రత్నారెడ్డి, జి.కార్తీక్, ఎం.వెంకట రమణ, తిరుపతి శివ, స్టాండ్ బైలుగా ప్రేమ్‌కుమార్, యోషేబు, ఎ.వెంకటరెడ్డి.

బాలికల జట్టు:
జి.ఝాన్సీ, డి.జ్యోష్ణ ప్రియ, ఎ.సాయి లత, ఎస్.కార్తీక వెన్నెల, కె.నందిని, సీహెచ్‌వి మహేశ్వరి, కె.గాయత్రి, డీఎస్ గాయత్రి, పి.రత్నదీపిక, వి.ధనలక్ష్మి, పి.స్వాతి, బి.తనూజ, కె.లోకేశ్వరి, స్టాండ్‌బైలుగా ఐ.శిరీష, జి.హన్న, బి.హర్షిణి, కె.బుజ్జి, బి.వెంకట హేమాంజని.

విద్యార్థులు ఎంచుకున్న రంగాల్లో రాణించాలి

- అస్సాం ప్రభుత్వ అడిషనల్ చీఫ్ సెక్రటరీ ఆరిజ్ అహమ్మద్
- 42 ఏళ్ల తరువాత కలిసిన పూర్వ విద్యార్థులు

పొదిలిరూరల్: విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో రాణించి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని అస్సాం ప్రభుత్వ అడిషినల్ చీఫ్ సెక్రటరీ ఎం.ఆరిజ్ అహమ్మద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 1982–83 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం నిర్వహించారు. కళాశాల పూర్వవిద్యార్థి అయిన ఆరిజ్ అహమ్మద్ సమావేశంలో పాల్గొన్నారు. పూర్వవిద్యార్థులంతా కలిసి తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యనభ్యసించి వివిధ రంగాల్లో ఉన్నతంగా స్థిరపడిన ముగ్గురి చేత విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆరిజ్ అహమ్మద్ మాట్లాడుతూ విద్యార్థులు ముందు చూపుతో ఆలోచించి వినూత్న అంశాలను ఆవిష్కరించే దిశగా పయనించాలన్నారు. రాబోవు కాలంలో విద్యార్థులు శాస్త్రవేత్తలుగా, వాణిజ్య వేత్తలుగా ఎదగాలని కోరారు. విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను చేరాలంటే సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలన్నారు. దేశ, విదేశాల్లో ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ఉన్నత స్థాయికి చేరిన వారి అనుభవాలు ఈతరం పిల్లలకు అవసరమని అన్నారు. కార్యక్రమంలో చీరాల జూనియర్ సివిల్ జడ్జి ఎస్ రెహనా, అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా స్థిరపడిన ఎల్ శ్రీధర్, ముక్కెర శామ్యూల్ శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



1982-83 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు

మాట తప్పిన కూటమి ప్రభుత్వం



మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో ప్రత్యేకంగా వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తుంగలోకి తొక్కిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు విమర్శించారు. వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ ఈ నెల 12న విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం సుందరయ్య భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా ఈ ఊసే ఎత్తడంలేదన్నారు. రైతాంగానికి సుఖీభవ ఇస్తామని చెప్పారని, దాని గురించి కూడా పట్టించుకోవడం లేదన్నారు. సుఖీభవ తరహాలోనే వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున అందజేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తెలంగాణాలో ఈ పథకం అమలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలు కూటమి ప్రభుత్వం ప్రశ్నార్థకంగా మార్చడం సమర్థనీయం కాదన్నారు. సగంలో ఆగిపోయిన ఇంటి నిర్మాణాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పేదల ఇళ్ల విషయంలో కూటమి ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి రూ.2.50 లక్షల కోట్లు కేటాయించాలని నిపుణులు సూచిస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్లో కేవలం రూ.80 వేల కోట్లు మాత్రమే కేటాయించడం దుర్మార్గం అన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులతో గ్రామీణ కూలీల పనిదినాలు క్రమంగా పడిపోతున్నాయని, పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లే క్రమంలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాల తరహాలో ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు కూడా విస్తరించాలని డిమాండ్‌చేశారు. పని ప్రదేశంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, పలుగు, పారా లాంటి పని ముట్లను వాటికి కేటాయించిన నిధులతోనే అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో కేజీ మస్తాన్, కంకణాల వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి ఆంజనేయులు, ఉబ్బా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభ..



ఇఫ్తార్ దువాలో ఉపవాస దీక్షధారులు

నాలుగు వాఖ్యాలు ప్రధానం...

పవిత్ర రంజాన్ మాసంలో నాలుగు విషయాలను అధికంగా స్మరించాలని మహ్మద్ ప్రవక్త ఉపదేశించారు. వాటి ప్రాముఖ్యతను ధార్మిక పండితులు వివరిస్తారు. లాయిలాహ ఇల్లాల్లహ్.. అస్తగ్ ఫిరుల్లా.. అస్ అలుక జన్నత్.. అవుజుబిక మిన్నార్ ఎక్కువగా చదవాలి.

30 రోజుల ప్రత్యేకత...

- రంజాన్ మాసంలో తొలి 10 రోజులు కారుణ్య దినాలు.
- 10 నుంచి 20 రోజులు క్షమాపణ రోజులు.
- 20 నుంచి 30 వరకు నరకాగ్ని నుంచి విముక్తి దినాలు.



అల్లాహ్ ప్రసాదించిన మాసం :

అల్లాహ్ ప్రసాదించిన నెల రంజాన్. ఈ మాసంలో ఆధ్యాత్మికతతో గడపాలి. నిరుపేదలకు ఫిత్రా, జకాత్ చేయాలి. నిష్ఠతో ఉపవాసం ఉండాలి. ప్రతి ముస్లిం జకాత్ తప్పనిసరిగా ఇవ్వాలి. పేదలు కూడా ధనికులతో సమానంగా పండుగ చేసుకునేలా చూడాలి. సాధ్యమైనంత వరకు మంచి పనులు చేయాలి. ఈ మాసంలో చిన్న దానం చేసినా పుణ్యం లభిస్తుంది.

– అబ్దుల్ కలాం, ముఫ్తి, కనిగిరి



దానం చేస్తే రెట్టింపు పుణ్యం :

రంజాన్ మాసంలో రూ.1 దానం చేస్తే రూ.70 చేసినంత పుణ్యం లభిస్తుంది. ప్రతి ముస్లిం తప్పనిసరిగా జకాత్ ఇవ్వాలి. తను ఉన్న ఇళ్లు కాకుండా ఇతర మార్గాల్లో వచ్చే సంపదలో 2.5 శాతం జకాత్‌గా చెల్లించాలి. ఇది అల్లాహ్ ఆదేశం. రంజాన్ మాసంలో రోజా ఉండటం ఎంత ముఖ్యమో.. పేదలకు సాయం చేయడం కూడా అంతే ముఖ్యం.

– ఎస్‌డీ ఇర్ఫాన్, డివిజన్ ఖాజీ, కనిగిరి



- రంజాన్ మాసం కావడంతో మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- కఠోర నిష్ఠతో ముస్లింల ఉపవాస దీక్షలు
- విరివిగా దానధర్మాలు

కనిగిరి రూరల్: ముస్లింల పవిత్ర మాసం రంజాన్ నెల. ఈ నెల 2వ తేదీ నుంచి రంజాన్ మాసం ప్రారంభం కావడంతో మసీదుల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ముస్లింలు ఈ మాసమంతా ఆధ్యాత్మికంగా గడుపుతారు. ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనల్లో నిమగ్నమవుతారు. ప్రతిరోజూ సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు కఠోర ఉపవాస దీక్షలు ఆచరిస్తారు. దానధర్మాలు చేస్తారు. ఐదుపూటల నమాజ్‌తో పాటు తరావీహ్ నమాజ్ ప్రార్థనల్లో పాల్గొంటారు. 30 అధ్యాయాలున్న ఖురాన్‌ను నెలలోగా చదవాలన్న ప్రవక్త ఆదేశాన్ని తప్పక పాటిస్తారు. పేదలకు సంపన్నులు జాత్ చెల్లిస్తారు. చివరి పది రోజులు ఇంటిని వదిలి మసీదుల్లోనే ఉంటూ దైవ నామస్మరణ చేస్తారు.

వీరికి ఉపవాసం మినహాయింపు...

మనిషి బలహీనతలను, వారి కష్టసుఖాలను బాగా ఎరిగిన దైవం ఉపవాసాన్ని విధిగా నిర్ణయించినప్పటికీ.. కొందరికి మినహాయింపులు కూడా ఇచ్చారు. చిన్న పిల్లలు, బాటసారులు, వ్యాధిగ్రస్తులు, వృద్ధాప్యం మరీ ఎక్కువైన వారు, మతిస్థిమితం లేని వారు, అశుద్ధావస్థలో ఉన్న మహిళలకు ఉపావాసం నుంచి మినహాయింపు ఉంది.


ఉపవాసం ప్రత్యేకత



ఇస్లాంలో నాలుగో మూల స్తంభం ఉపవాసం. ముస్లిం సమాజం త్రికరణ శుద్ధితో ఆచరించే ఆరాధన వ్రతమిది. ఎదుటి వారి ఆకలి విలువ గుర్తించాలన్నది దీని ప్రధాన ఉద్దేశం. ఉపవాసాన్ని అరబిక్ భాషలో 'సామ్'గా, ఉర్దూలో 'రోజా'గా పిలుస్తారు. ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం తొమ్మిదో నెల రంజాన్ మాసం. ఈ నెలలో ఆరాధన వ్రతాన్ని ఎంతో నియమ నిష్టలతో పాటిస్తారు. ఇస్లాం ధర్మ శాస్త్ర పరిభాషలో 'సామ్' అంటే ఆగి ఉండటం. అంటే ఉషోదయం నుంచి సూర్యాస్తమయం వరకు తినడానికి, తాగడానికి, మనోవాంఛలకు దూరంగా ఉండటమని అర్థం.

దాన ధర్మం.. పుణ్య ఫలం...

ముస్లింలకు అత్యంత ప్రీతికరమైనది రంజాన్ మాసం. జీవితాన్ని, జీవిత గమనాన్ని మార్చివేసి మనసుకు ప్రశాంతతనిచ్చే ఈ మాసంలో ఇస్లామియా బోధనల ప్రకారం వారు నడుచుకుంటారు. దీని వల్ల మిగతా 11 నెలలు కూడా అదే విధంగా జీవించేలా అలవాటవుతుందని ముస్లింల నమ్మకం. ఇదే కాకుండా ఆరాధన విషయంలో ఇస్లాం నిర్వచనం విభిన్నమైంది. విధిగా చేయాల్సిన నమాజ్, రోజా, జకాత్ హజ్ వంటి ఆరాధనలే కాదు.. దేవుడిని ప్రసన్నం చేసుకోవడానికి ఖురాన్ ఆదేశాల ప్రకారం చేసిన ప్రతి మంచి పనీ ఆరాధన కిందకే వస్తుంది. అందుకే రంజాన్ మాసంలో చేసే ఏ పనులకైనా 70 రెట్లు ఎక్కువ పుణ్యం లభిస్తుందని ముస్లింల నమ్మకం. ఒక రూపాయి దానం చేస్తే రూ.70 దానం చేసినంత పుణ్యం లభిస్తుందని ముస్లిం మత పెద్దలు చెబుతున్నారు. అందుకే ఈ నెలలో అందరూ దాన ధర్మాలు ఎక్కువగా చేసి పుణ్య ఫలాలు పొందాలని ఆశిస్తారు.



కనిగిరిలో ముస్తాబైన మసీదు

రెండు రకాలుగా దాన ధర్మాలు...

సమాజంలో నిర్భాగ్యులు, అనాథలను ఆదుకోవడానికి దానం చేయాలని ఇస్లాం బోధిస్తుంది. అందుకే ముస్లింలు రంజాన్ మాసంలో ఇతోధికంగా దానధర్మాలు చేస్తుంటారు. ఖర్చుకు ఏమాత్రం వెనుకాడరు. ఇస్లాంలో దానధర్మాలు రెండు రకాలు. ఒకటి.. తప్పనిసరిగా చేయాల్సినది 'జకాత్'. అంటే తన వద్ద ఉన్న సంపదలో 2.5 శాతం పేదలకు పంచాలి. ఇలా చేయడం ద్వార సంపద శుద్ధి అవుతుందని నమ్మకం. రెండోది 'ఫిత్రా'. రంజాన్ మాసం ఆఖరి రోజు (పండుగ) తర్వాత ఈద్ నమాజ్ కన్నా ముందు ఫిత్రా తప్పనిసరిగా చెల్లించాలి. ఇంట్లో ఎంతమంది ఉంటే అందరి పేరిట ఫిత్రా దానం తప్పనిసరిగా చేయాలి. రెండు కిలోల 50 గ్రాముల ధాన్యం లేదా గోధుమలు లేదా మార్కెట్‌లో వాటి ధరకు సరిపడా నగదునైనా పేదలకు దానం చేయాలి. పేదలు కూడా ధనికులతో సమానంగా పండుగ చేసుకోవాలన్నదే ఈ 'ఫిత్రా' సాయం ఉద్దేశం.

క్లుప్తంగా

ఏడుగురు జూదరుల అరెస్ట్

టంగుటూరు: మండలంలోని జయవరం గ్రామ శివారులో పేకాట శిబిరంపై స్థానిక ఎస్సై నాగమల్లీశ్వరరావు ఆదివారం సిబ్బందితో దాడి చేశారు. అక్కడ పేకాటాడుతున్న ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.37,940 స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

రెడ్డి జన అభ్యుదయ సంఘం పాలకవర్గం ఎన్నిక



కేవీ రమణారెడ్డి

ఒంగోలు సిటీ: రెడ్డి జన అభ్యుదయ సంఘం, ఒంగోలు పాలకవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రెసిడెంట్‌గా కేవీ రమణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా నరహరి రామలింగారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా ఆదిరెడ్డి, జాయింట్ సెక్రటరీగా వెంకటేశ్వరరెడ్డి, కోశాధికారిగా భవనం నాగిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా పాలవల్లి వెంకటేశ్వరరెడ్డి, పాలపోలు సురేష్‌రెడ్డి, జై సింహారెడ్డి, స్వామిరెడ్డి, నారాయణరెడ్డి, యుగంధర్‌రెడ్డి, రవీంద్రారెడ్డిని ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

జిల్లా బధిర సంఘ కార్యవర్గం ఎన్నిక



బధిర సంఘ నూతన కార్యవర్గం

ఒంగోలు టౌన్: జిల్లా బధిర సంఘ కార్యవర్గ ఎన్నికలు స్థానిక అంబేద్కర్ భవనంలో ఆదివారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా పి.శశికుమార్, రిటర్నింగ్ అధికారులుగా ఎస్.సుభుల్ బాషా, సీహెచ్ సాంబశివరావు, డి.మాబు వలి వ్యవహరించారు. జిల్లా అధ్యక్షునిగా ఎం.రాజేంద్ర, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ ఏడుకొండలు, జనరల్ సెక్రటరీగా ఎం.నాగిరెడ్డి, ట్రెజరర్‌గా ఎం.సునీల్, జాయింట్ సెక్రటరీగా టి.వెంకటరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎస్.వీరనారాయణ, ఎస్.అశోక్, ఎం.నాగార్జునరెడ్డి, వి.భవానిలను ఎన్నుకున్నారు. కార్యవర్గ ఎన్నికకు వచ్చిన బధిరులకు సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు భోజన ఏర్పాట్లు చేశారు.

బధిరుల సమస్యల పరిష్కారానికి కృషి

ఒంగోలు మెట్రో: బధిరుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మండవ మురళీకృష్ణ తెలిపారు. ప్రకాశం జిల్లా బధిరుల సంఘ విస్తృతస్థాయి సమావేశాన్ని ఆదివారం ఉదయం స్థానిక అంబేద్కర్ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని బధిరుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు తమ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహకారం అందిస్తామని తెలిపారు. మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలోని బధిరుల సమస్యలను ప్రభుత్వం ద్వారా పరిష్కరించేందుకు అందరూ ఐక్యంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బధిరుల సంఘ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎం.రాజేంద్ర, శ్రీనివాసరావు, ప్రకాశం జిల్లా బధిరుల సంఘ సభ్యులు, సూర్య ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉగాది ఉత్సవాలు



పొంగళ్లు తయారు చేస్తున్న భక్తులు



అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

- మార్కాపురంలో కిక్కిరిసిన అల్లూరి పోలేరమ్మ ఆలయం

మార్కాపురం టౌన్: పట్టణ శివారులోని ఎస్‌వీకేపీ కళాశాల రోడ్డులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ దేవస్థానంలో ఉగాది ఉత్సవాలను రెండో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో కిటకిటలాడింది. ప్రతిఏడాది ఉగాది పండుగకు 4 ఆదివారాలు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. అందులో భాగంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు పొంగళ్లు తయారు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. పోలేరమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చి అందరినీ చల్లగా చూడాలని కోరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న నాగమయ్య పుట్టల్లో పాలు పోశారు. భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా అల్లూరి పోలేరమ్మ ప్రసిద్ధి చెందడంతో మార్కాపురం పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్‌శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఉన్న నాగులపుట్టకు, నాగమయ్య శిలలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనానికి భారీగా క్యూకట్టారు. ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పూజలందుకుంటున్న అల్లూరి పోలేరమ్మ

జంగమ దేవరుల అడహక్ కమిటీ ఏకగ్రీవం



జంగమ దేవరుల సమావేశంలో చర్చించుకుంటున్న కమిటీ సభ్యులు

ఒంగోలు సిటీ: జంగమ దేవరుల నూతన అడహక్ కమిటీ సభ్యులుగా మాదాల మల్లిఖార్జునరావు, నాగండ్ల సుబ్రహ్మణ్యం, దోగిపర్తి సుబ్బారావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఒంగోలు అంజయ్య రోడ్డులోని బీసీ కులాల ఆరామ క్షేత్ర సముదాయంలో ప్రకాశం జిల్లా జంగమ సంఘం అధ్యక్షుడు ముసునూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో జంగమ కుల ఆరామక్షేత్ర అభివృద్ధి కమిటీ ఏర్పాటు గురించి చర్చించారు. ఎన్నికైన సభ్యులు జంగమ కుల ఆరామ క్షేత్ర నిర్మాణానికి, ఆరామక్షేత్ర నూతన కమిటీని ఏర్పాటు చేసేందుకు పూర్తి బాధ్యతలు నిర్వరిస్తారు.

భైరవకోనలో ప్రముఖుల పూజలు



భైరవకోనలో త్రిముఖదుర్గాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న అధికారులు, భక్తులు

సీఎస్ పురం (పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం భైరవకోనలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. పలువురు ప్రముఖులు వచ్చి పూజలు చేశారు. బాపట్ల అడిషనల్ ఎస్పీ తిరుపతి పాండురంగా విఠలేశ్వరరావు, రిటైర్డ్ ఆర్డీఓ నాగబాబు, తదితర ప్రముఖులు త్రిముఖదుర్గాదేవి, కాలభైరవ, నగరేశ్వర, భర్గలేశ్వర ఆలయాల్లో నిర్వహిస్తున్న పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు వారితో విశిష్ట పూజలు చేయించారు. ఈఓ వంశీకృష్ణారెడ్డి, ముప్పాళ్ల శ్యామ్‌సుందర్‌రాజు ఆధ్వర్యంలో అర్చకులు ఆశీర్వచనం అందజేసి స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్, సరాబు చంద్రమోహన్, భక్తులు పాల్గొన్నారు.

మూడు గ్రానైట్ లారీలు స్వాధీనం

కొనకనమిట్ల: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న మూడు లారీలను సేల్స్ ట్యాక్స్ అధికారులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి కనిగిరి నుంచి గ్రానైట్ రాళ్లతో తాడిపత్రి వెళ్తుండగా చినారికట్ల జంక్షన్ వద్ద సేల్స్ ట్యాక్స్ అధికారులు కాపు కాసి మూడు లారీలను పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రానైట్ రాళ్లు తరలిస్తుండటంతో లారీలను స్వాధీనం చేసుకుని కొనకనమిట్ల పోలీసులకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్



అరెస్ట్ చేసిన వ్యక్తితో పోలీసులు

చీరాల: అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఈపూరుపాలెం ఎస్సై ఎ.చంద్రశేఖర్ తెలిపారు. వేటపాలెం మండలం రామాపురంలోని బీచ్ రోడ్‌లో వాయల రాంబాబు కూల్‌డ్రింక్ షాపులో తనిఖీలు చేయగా, విస్కీ 7 బాటిళ్లు, ఇంపీరియల్ బ్లూ 4, మెక్‌డోల్స్ 3 కలిపి మొత్తం 14 బాటిళ్లు దొరకగా సీజ్ చేశారు. అతనిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

- మృతుడు బీహార్ వాసి



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఉలవపాడు: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో బీహార్ రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన జాతీయ రహదారిపై ఉలవపాడు మండల పరిధిలోని రాజుపాలెం–చాగల్లు మధ్య ఆదివారం జరిగింది. బీహార్ రాష్ట్రానికి చెందిన ప్రశాంత్ (28) చాగల్లు సమీపంలోని ఓ పాల డెయిరీలో పనిచేస్తున్నాడు. ఉలవపాడు నుంచి చాగల్లు వద్ద తాను పనిచేస్తున్న డెయిరీ వద్దకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఆ సమయంలో వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఎగిరి రోడ్డుపై పడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలాన్ని ఎస్సై అంకమ్మ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సయ్యద్ యాసీన్

- రేపు చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసీన్

కనిగిరి రూరల్: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, పారిశుధ్య కార్మికులను క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసీన్ డిమాండ్ చేశారు. అందుకోసం ఈ నెల 11వ తేదీ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంబంధిత వాల్‌పోస్టర్లను స్థానిక దర్శి చెంచయ్య భవన్‌లో ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో సయ్యద్ యాసీన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందన్నారు. మున్సిపల్ ఉద్యోగ, కార్మికులకు వేతనాలను మున్సిపల్ శాఖ నుంచే చెల్లించాలని, సాంఘిక భద్రత కల్పించాలని, పెరిగిన జనాభా ప్రకారం కార్మికుల సంఖ్య పెంచాలని, కరోనా సమయంలో తీసుకున్న కార్మికులను మున్సిపల్ కార్మికులుగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తించే విధంగా చర్యలు చేపట్టాలని, విధి నిర్వహణలో చనిపోయిన, ఉద్యోగ విరమణ చేసిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను నియమించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో నిర్వహించనున్న కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు ఎస్‌కే నాసర్, కోటయ్య, అశోక్, కిరణ్, తాజు, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.